# పిత్రోత్సాహం

మోచెర్ల శ్రీ హరికృష్ణ

*మోచెర్ల శ్రీ హరికృష్ణ స్వతహాగా హాస్యప్రియులు. వాతావరణాన్ని చతురోక్తులతో నింపి ఆహ్లాదపర్చడం వారి హాబీ. అభినందించినవారితో, "ఇది మా నాన్నగారు శ్రీ మోచెర్ల జానకి రామయ్యగారి నేర్పులో వెయ్యోవంతు కూడా కాదు" అనడం వారి వినయమే కావచ్చు. కానీ అందుకు సమర్థనగా వారు ఉటంకించిన ఈ క్రింది ఉదంతాల్లో హాస్యబండారం కనిపించడమే కాదు, ఆదర్శప్రాయమై అనుసరణీయమైన వారి పిత్రోత్సాహమూ వినిపిస్తుంది. ఇవి శ్రీ హరికృష్ణ వినిపించిన శ్రీ మోచెర్ల జానకిరామయ్య చతురోక్తులు, చతుర ఘటనలు:*

దీపావళినాడు మీరు ఏమి కాల్చారు మాస్టారూ– అని శ్రీ మోచెర్ల జానకిరామయ్యగారిని ఎవరో అడిగారు. మా పిల్లలు టపాకాయలు కాల్చారు, నేను సిగరెట్లు కాల్చాను– అన్నారాయన.

మా కాలేజీలో కోతుల హడావిడి ఎక్కువ. రేకు షెడ్లమీద గంతులు వేస్తూ చాలా గోల చేసేవి. ఒక రోజు మా నాన్నగారు క్లాసులో పాఠం చెబుతుంటే అవి చాలా గోల చేస్తున్నాయి. అప్పుడాయన, "మన కాలేజీలో కొత్తవాళ్ళు జాయిన్ అవుతున్నారు అనుకుంటాను చాలా హడావిడిగా ఉంది" అన్నారు.

ఆయన వక్కపొడి ఎక్కువగా తినేవారు. "మాష్టారూ, వక్కపొడి తింటే రక్తం విరిగిపోతుంది అంటారు. మీరు ఎందుకు తింటారు?" అని ఎవరో అడిగారు. దానికి ఆయన "అది రక్తం ఉన్నవారికండి, నాకు భయం లేదు" అని చెప్పారు.

ఒకసారి ఆయన ఏదో జోక్ చెప్పారు. ఒక స్టూడెంట్, "మాస్టారూ, ఇది పాత జోకేనండి" అన్నాడు. "అల్లాగా బాబూ, నువ్వు ఈ క్లాసులో ఎన్ని ఏళ్లుగా ఉన్నావు?" అని అడిగారు.

ఆ రోజుల్లో కూడా టీచర్లకు ఎలక్షన్ డ్యూటీ వేసేవారు. దానికి ఆయన, "ఏమిటో సర్కార్ వారు మాకు బూతు పని ఇచ్చారు" అనేవారు. అదేమిటి మాస్టారూ అంటే "బూతు అంటే ఎలక్షన్లో పోలింగ్ బూత్ అని అర్థం నాయనా! నువ్వు కంగారుపడకు" అనేవారు.

పరీక్ష హాల్లో ఇద్దరు స్టూడెంట్స్ గుసగుసలాడుతోంటే, "బాబూ, జోగి జోగి రాసుకుంటే రాలేది బూడిదే కదా? ఇక్కడ బూడిద రాల్చకండి" అనేవారు.

ఒక మొద్దు స్టూడెంట్ ఉండేవాడు అతనితో– నాయనా నువ్వు క్లాసులో ఇనుము, పరీక్ష హాలులో రాయి– అనేవారు. ఇనుము, రాయి కొరకరాని పదార్థాలు అని ఆయన ఉద్దేశ్యం.

ఆయన ఒకరోజున ఒక హోటలుకి వెళ్లి ఇడ్లీ ఆర్డరు చేసారుట. ఆ ఇడ్లీలు చూస్తే చల్లగా, కొంచెం నిలవున్న వాటిలా కనిపించి, "బాబూ, వీటి వయస్సు ఎన్ని రోజులు?" అని అడిగారుట.

1960లో వేసంగి సెలవలకు మా అమ్మమ్మ గారి ఊరు ఆలమూరు వెళ్ళాము. మా తండ్రి గారికి ఇంగ్లీష్ పేపరు 'హిందూ' చదవడము బాగా అలవాటు. అ ఊరిలో ఏ రోజు పేపరు ఆరోజు దొరకదు. ఇంగ్లీష్ పేపర్ అయితే అస్సలు దొరకదు. మా మామయ్య ఏదో చేసి ఒక రోజు లేటుగా పేపరు ఏర్పాటు చేసాడు.

అప్పుడు మా నాన్నగారు, "నేను నిన్న ఓ షాపుకి వెళ్లి పేపర్ కావాలి అని అడిగితే ఇవాళ్టిదా, నిన్నటిదా అని అడిగాడు. ఈవాళ్టిది కావాలి అంటే– అయితే రేపు రండి అన్నాడు. ఈ పేపర్ ఆ షాపు వాడిదేనా?" అని– Any way, yesterday's news paper is today's waste paper. Let us treat it as today's paper. Today is yesterday's tomorrow for which we are waiting since yesterday- అని సరిపెట్టుకున్నారు.

పిల్లలమీద మా నాన్నగారి వ్యాఖ్యలు:

పిల్లలు రెండు రకాలు. ఒకటి మన పిల్లలు, రెండు చెడ్డ పిల్లలు.

If your child is not mischievous, show him to a doctor.

నేటి పిల్లలే రేపటి గుమాస్తాలు.

ఒకసారి నాకోసం ఎవరో ఫ్రెండ్ బయటనుంచి హరీ అని పిలిచాడు. వెంటనే ఆయన "చూడరా బయట ఎవరో హరీ అన్నారు, పాపం" అన్నారు. (హరీ అనడం అంటే చనిపోవడం కూడా అని నేటి బాలలకు తెలియకపోవచ్చు)

ఒకరోజు మేము ఒక ప్రైవేటు బస్సులో ఆలమూరు వెడుతున్నాము. ఆరోజుల్లో బస్సు లోపల హరే రామ హరే రామ, స్త్రీలు, పొగ త్రాగరాదు వగైరా రకరకాల సూచనలు రాసి ఉండేవి. "స్త్రీలు, పొగ త్రాగ రాదు అన్న వాక్యం మధ్యలో గేప్ లేకుండా ఒకే వాక్యంలా వ్రాయడం వలన అర్థం మారిపోయింది. పురుషులు పొగ త్రాగవచ్చును" అని చెప్పేవారు. దేవుని స్మరింపుము– అన్న మాట చదివి– మన ప్రయాణం దేవుడి చేతిలో ఉంది అనేవారు.

ఒక కుర్రాడు మా తండ్రిగారి దగ్గర ఇంగ్లీష్ ప్రైవేటుకి వచ్చేవాడు. ఒకరోజు వచ్చి రెండు రోజులు మానేసేవాడు. నిన్న రాలేదేమని అడిగితే, పనుంది రాలేదని చెప్పాడు. ఓహో తమరు పని లేనప్పుడు ప్రైవేటుకి వస్తారు, అంతేనా అన్నారు నాన్నగారు.

ఊరగాయల సీజనులో "అప్పు చేసి ఆవకాయ పెట్టనేల, మక్కువగా మాగాయి మెక్కరా', అనీ "సంసారి దుఃఖి సన్యాసి సుఖి, సంసారికి చీరల పేచీ, సన్యాసికి బెత్తెడు గోచీ" అనేవారాయన.

మా తండ్రిగారు ఇంగ్లీష్ బుక్స్ చాలా కొని చదివేవారు. ఎరువు తీసుకోవడము ఆయనకు ఇష్టం ఉండేది కాదు. ఎవరైనా బుక్స్ ఎరువు అడిగితే కూడా చిరాకు పడేవారు. పుస్తకం, వనితా,విత్తం– పరహస్తం గతం గతః అని చెప్పేవారు. అందరూ అల్లాంటివాళ్ళేనా అనడిగితే, "కొంతమంది అతికష్టంమీద తిరిగిస్తారు కానీ మనమిచ్చిన కండిషన్లో ఇవ్వరు. దానికీ ఒక శ్లోకముంది. అథవా పునరాయతమ్, జీర్ణః, భ్రష్టః, ఖండః" అని చెప్పేవారు. ఒకసారి ఎవరో ఆయన దగ్గర The Count of Monte Cristo (by Alexander Dumas) అనే నవల ఎరువు తీసుకొని ఎన్నిసార్లు అడిగినా తప్పించుకు తిరిగేవాడుట. ఈయనకి పుస్తకం కొనగానే, సంతకం చేసి డేటువేసే అలవాటు ఉండేది. ఒకరోజు మద్రాస్ మోర్ మార్కెట్లో ఒక పాత పుస్తకాల షాపులో సదరు పుస్తకం కనపడిందిట. ఈయన సంతకం డేట్ అన్నీ స్పష్టంగా ఉన్నాయట. ఈయన తన పుస్తకాన్ని రెండోసారి ఆ షాపులో కొనవలసిన పరిస్థితి ఏర్పడి, సగం రేటుకి ఆ పుస్తకం కొనుక్కున్నారు.

ఆయన తన కళ్ళజోడు ఇంట్లో ఎక్కడో పెట్టి మరచిపోయేవారు. ఎంత వెతికనా దొరికేది కాదు. అప్పుడు అనేవారు– "It is very difficult to search for your glasses without glasses - that is called catch 22 situation".

ఆయన భీమవరం కాలేజిలో జాయిన్ అయిన రోజున అక్కడ పనిచేసే శంకరం గారు అనే ఆయనను పరిచయం చేస్తే ఆయన్ని– ఏమండి, మీ ఇంటి పేరు 'టి' అని నాకు అనుమానముగా ఉంది నిజమేనా?

అనడిగారుట. దానికి శంకరం గారు– అవునండి మా ఇంటి పేరు తెన్నేటి. మీకెలా తెలుసు– అని బోల్డు హాశ్చర్యపడిపోయారుట. (అసలు మా తండ్రిగారు టి అంటే 'తిక్క' అయి ఉంటుంది, పూర్తిపేరు తిక్క శంకరం అనే ఐడియాతో అడిగారుట). ఆ తరువాత వారిద్దరూ మంచి ఫ్రెండ్స్ అయ్యారు.

మా కాలేజి ఎదురుగా శాస్త్రి గారి హొటల్ అని ఒక చిన్న హొటల్ వుండేది. మా తండ్రి గారు, ఆ DNR College ఎక్కడ అంటే శాస్త్రి గారి హొటల్ ఎదురుగా అని చెప్పుకుంటున్నారు– అనేవారు. నేను భువనేశ్వర్లో పని చేసినప్పుడు ఒకసారి నేను Reserve Bank Of India లో official work గురించి వెళ్ళవలసి వచ్చింది. అక్కడ రిక్షావాళ్ళు తెలుగు బాగా మాట్లాడుతారు. ఒక రిక్షావాడిని Reserve Bank కి వస్తావా అనడిగితే అదెక్కడ బాబూ అనడిగాడు. కేసరి టాకీస్ ఎదుట ఉంది అని చెప్పవలసి వచ్చింది. అప్పుడు మా తండ్రి గారి జోక్ గుర్తు వచ్చి నవ్వుకున్నాను.

భీమవరంలో ఆదివారం సంతకి ఆయనతోపాటు నేను, మా తమ్ముడు– కూరగాయలు కొనడానికి వెళ్ళేవాళ్ళము. పొట్లకాయలు, వంకాయలు, బీరకాయలు, ఆకుకూరలు– ఇలా చాలా కొనే వారు. రిక్షాలో నేను, మా తమ్ముడు ముందు నిల్చుని పొట్లకాయలు పట్టుకొని ధనుర్బాణాలు పట్టుకుని యుద్ధానికి వెళ్ళే లవకుశులు మేమే అన్నట్లు ఫీల్ అయ్యేవాళ్ళము. పొట్లకాయలు విరగకొట్టకూడదు. ఇంటికి చేరేవరకు చాలా విషమపరీక్ష అన్నమాట. దారిలో బెంగళూరు హొటల్లో టిఫిన్ తప్పనిసరి. ఒక విధంగా ఆదివారం ఎప్పుడా అని ఎదురుతెన్నులు చూసేవాళ్ళము.

ఒక రోజు మా తండ్రిగారు మద్రాస్ మెయిల్లో మొదటి తరగతిలో ప్రయాణం చేస్తున్నారు. దారిలో విజయవాడలో మెయిలు ఆగినప్పుడు అక్కడ పేపర్లు, పుస్తకాలూ అమ్మే బండి వస్తే క్రిందికి దిగి ఒక పేపరు, ఒక వీక్లీ తీసుకుని కిటికీలోంచి తన సీటులో పెట్టారు. ఇంకా డబ్బులు ఇవ్వలేదు. ఈ లోపల రైల్లో ఈయన పక్కసీటులో ఆయన వీక్లీ చటుక్కున అందిపుచ్చుకొని గబగబా చదవడం మొదలెట్టాడు. అప్పుడు ఈయన ఆ బండివాడిని ఇంకొక వీక్లీ ఇయ్యమని ఒక్క వీక్లీకే డబ్బులు ఇచ్చారు. బండివాడు ఇంకో వీక్లీకి కూడా డబ్బులడిగితే, "దానికి లోపల ఉన్నారు చూడు, ఆయన ఇస్తారు" అని చెప్పారు. లోపల ఉన్న ఆయన సిగ్గుపడి, కంగారు పడి, "సారీ మిమ్మల్ని అడక్కుండా వీక్లీమీద దాడిచేశాను ఏమనుకోకండి" అని చెప్పి, ఆ బండివాడికి డబ్బులు ఇచ్చాడు. ఆ తరువాత ప్రయాణములో వారిద్దరు మంచి స్నేహితులు అయినారు.

ఆయన వృత్తిరీత్యా English lecturer అయినప్పటికీ– పంచె, లాల్చి, కండువా ధరించేవారు. ఒకరోజు విశాఖపట్నంలో మీటింగుకి వెడుతూ నిడదవోలులో మొదటి తరగతి బోగీలో ఎక్కబోతుంటే లోపలున్న ఇద్దరు Medical Representatives ఈయన వేషధారణ చూసి పల్లెటూరి బైతు అనుకొని, "ఇది ఫస్టు క్లాసు. నీలాంటి బైతులు ఎక్క కూడదు, దిగిపో" అని హేళన చేసారు. ఈయన ఖాతరు చేయకుండా రైల్లో వాళ్ళ ఎదురుగానే కూర్చున్నారు. ఆ ఇద్దరూ ఈయన మీద ఇంగ్లీషులో కామెంట్స్ చెప్పుకోవడం మొదలుపెట్టారు. వాళ్ళని అలా వాగనిచ్చి తరువాత వాళ్ళకి etiquette, decorum, behaviour గురించి అనర్గళంగా స్వచ్ఛమైన ఇంగ్లీషులో ఒక పావుగంట లెక్చర్ ఇచ్చారుట. దానితో వాళ్ళిద్దరికీ దిమ్మతిరిగి ఈయనను క్షమించమని అడిగారుట. ఆయన వాళ్ళకి పెట్టిన పేర్లు– తెలుగులో 'మందులోళు',. ఇంగ్లీషులో "Tailormade Gentlemen". ఆయన ఎప్పుడూ చెబుతూండేవారు– "Never buy a book by its cover nor judge a person by his dress".

దసరా పండుగ రోజుల్లో 'దసరా మామూలు' కోసము చాలా నసపెట్టి పీడించేవాళ్ళు మా ఇంటికి వచ్చి

మా నాన్నగారిని, "మాష్టారూ, మీకు తోచినంత ఇవ్వండి"– అనడిగారు. దానికి ఆయన, "నాకు ఏమీ తోచడం లేదయ్యా, అందుకే ఏమీ ఇవ్వలేను ఏమీ అనుకోవద్దు" అన్నారు.

మా చిన్నప్పుడు మా అమ్మగారు మహిళామండలి ప్రెసిడెంటుగా ఉన్నప్పుడు ఒక ప్రముఖ కవికి సన్మానసభ ఏర్పాటు చేసారు. ఆయన యాభై ఏళ్ళ బ్రహ్మచారి. ఆ సభలో మా పిన్ని అందరిలోనూ చిన్నది (బహుశా 14, 15 ఏళ్ళ వయసు అమ్మాయి) అని ఆవిడచేత ఆయనగారికి దండ వేయించారు. మర్నాడు ఆ ఫోటో పేపర్లో పడింది. ఆ ఫోటో చూసి మా నాన్నగారు, "బాగుందే అమ్మాయీ, ఒక్క పైసా ఖర్చులేకుండా ఒక కవి గారిని స్వయంవరంలో పెళ్లి చేసుకున్నావు" అని ఏడిపించారు.

ఆ రోజుల్లో– విద్యార్థులు భావి గుమాస్తాలు– అని "గుమాస్తాలూ, దయచేసి గోక్కోండి" అనేవారు మా నాన్నగారు. ఒక విద్యార్థి, "సార్ నాకు దురద లేదు" అన్నాడు. ఐతే నీ పక్కవాడికి గోకు అన్నారుట ఆయన.

"ఈ వేళ నేను చెప్పే లెసన్ సెప్టెంబరు వాళ్ళకి పనికొస్తుంది – ఎందుకయినా మంచిది, జాగర్తగా వినండి" అనేవారుట క్లాసులో అప్పుడప్పుడు.

చివరగా ఆంగ్లంలో ఆయన చెప్పిన మరపురాని చతురోక్తులు కొన్ని ఇక్కడ ఉదహరిస్తున్నా:

As long as you keep mum, people may mistake you for an idiot. Once you open your mouth, the doubt is clarified.

Hari (myself) goes where the wind blows: He has his brain in his knees, whenever he starts thinking, he must walk.

Please develop the habit to consult a dictionary, when you have a doubt on any spelling. Unfortunately, you think that whatever you write is correct spelling and never bother to refer any dictionary and get along with the bad spelling.

Old fools are babes again. You must treat them, check them, flatter them and cajole them as you do with your children.

(this is a quotation of Shakespeare which was duly expanded by my father, with reference to the present day behavior of old people who lost their memory or suffering from schizophrenia and old age blues and how to treat them by their children).